క్లుప్తంగా

వచ్చే నెల 18న ప్రత్యేక లోక్‌అదాలత్

నూజివీడు: ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలననుసరించి మార్చి 18న నూజివీడు కోర్టు ప్రాంగణంలో కుటుంబ తగాదా కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

24న శ్రీస్వామి వారికి శాంతి కల్యాణం

మైలవరం: స్థానిక కోదండ రాయాలయంలో శ్రీరాముల వారికి శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు శాంతి కల్యాణం జరుగుతుందని ఆలయం కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు అభయాంజనేయస్వామి ఆలయంలో ఐదో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చిరంజీవాచార్యులు ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామికి అభిషేకం, తమలపాకులతో అర్చన నిర్వహించారు.

సచివాలయాల తనిఖీ

మేడూరు/చింతలనర్వ(గంపలగూడెం): మేడూరు, చింతలనర్వ గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ఆధార్ సేవలను పరిశీలించారు. ఆధార్‌కార్డులలో పేరు తప్పులు, అడ్రస్ మార్పు, చిన్న పిల్లల ఆధార్‌కార్డుల నమోదు, ఆధార్ అప్డేషన్ విషయమై ప్రజలకు సిబ్బంది తగిన సేవలు అందజేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు, ఈ సేవ సర్వీసులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వేలను పరిశీలించారు. ఆయా సర్వేలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

23 నుంచి ఉచిత యోగా శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నుంచి స్థానిక బీకాలనీ ఆడిటోరియంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు యోగా గురువు లంకే జనార్దన్ మంగళవారం తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుంది. ఆసక్తి గలవారు 6301450859లో సంప్రదించాలని కోరారు.

రోలుపడిలో ఇంటింటికీ వైద్యుడు

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిలో మంగళవారం ఇంటింటికీ వైద్యుడు కార్యక్రమం నిర్వహించారు. చౌటపల్లి, రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కల్యాణ చక్రవర్తి, చలపతిరావు గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మధుమేహం, రక్తపోటు రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ కాంతమ్మ, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్మన్ రవి కుమార్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భారతి

తిరువూరు: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహకారంతో కార్యక్రమాలు జరపాలని కోరారు. తహసీల్దారు సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా త్వరితగతిన పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. రెండో దశ నాడు-నేడు పనులను ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సోమశేఖర నాయక్ తెలిపారు. జలజీవన్ మిషన్ పనుల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్ వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో ఆశ్రమ పాఠశాలకు మహర్దశ

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వసతులు

ఎ.కొండూరు: జిల్లాలోనే ఏకైక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌కు నాడు-నేడు పనులతో మహర్దశ పట్టింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలను ముస్తాబు చేశారు. ఎ.కొండూరు అడ్డరోడ్డు చైతన్యనగర్‌లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 262 మంది విద్యార్థులున్నారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ప్రారంభించారు. పది మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

రూ.53 లక్షలతో నాడు-నేడు పనులు

ఈ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కొరకు మొదటి విడత నాడు-నేడు పథకం ద్వారా రూ. 22లక్షలతో తాగునీరు, విద్యుత్ సరఫరా, బెంచ్‌లు ఏర్పాటు చేశారు. భవనానికి మరమ్మతులు చేయించి రంగులతో తీర్చిదిద్దారు. అన్ని వసతులు సమకూర్చడంతో పాఠశాల కళకళలాడుతోంది. రూ. 31 లక్షలతో ప్రహరీ నిర్మించారు.

నాబార్డు నిధులతో పనులు

నాబార్డు నిధులు రూ.కోటీ 15 లక్షలతో పనులు చేయించారు. నూతనంగా భోజనశాల నిర్మించారు. సీసీ రహదారులు వేయడం, హాస్టల్‌కు ప్రహరీ గోడ, అదనపు తరగతి గదులు నిర్మాణం, 20వేల లీటర్ల సామర్థ్యంగల తాగునీరు ఓవర్ హెడ్ ట్యాంక్, విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలాన్ని చదును చేయించారు.

పెరిగిన విద్యార్థుల హాజరుశాతం

విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చడంతో పాఠశాల కళకళలాడుతుండటంతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకపోవడం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం అమలు కావడంతో ఆకర్షితులైన విద్యార్థులు ఈ ఏడాది ఏ.కొండూరు, తిరువూరు, విస్సన్నపేట, మైలవరం, రెడ్డిగూడెం, నూజివీడు మండలాల నుంచి ఈ పాఠశాలలో చేరుతున్నారు. ఈ ఏడాది 80 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఈ మండలంలో అధికశాతం గిరిజనులు ఉండటంతో 70శాతం సీట్లు వాళ్లకే కేటాయించారు. ఎస్సీలకు 10శాతం, బీసీలకు 10శాతం, ఓసీ విద్యార్థులకు 10 శాతం మంది ఈ పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఆశ్రమ పాఠశాల ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మారి నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో విద్యార్థులు ఈ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.



ఏ.కొండూరులో నాడు-నేడు పనులతో రూపుదిద్దుకున్న గిరిజన ఆశ్రమ పాఠశాల



నూతనంగా నిర్మించిన విద్యార్థుల భోజనశాల



భోంచేస్తున్న విద్యార్థులు

రుచికరమైన భోజనం



ఈ పాఠశాలలో మెనూ ప్రకారంగా రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. రోజూ మెనూతో పాటు, గుడ్డు, ఆకుకూరలు, సాంబారు, రాగిజావ, వారంలో రెండు సార్లు చికెన్, అరటిపండ్లు ఇస్తున్నారు. అన్ని వసతులు ఉన్నాయి.

– అజ్మీర జస్వంత్, 8వ తరగతి

అడ్మిషన్లు పెరిగే అవకాశం



వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది. అమ్మ ఒడి, కొత్త మెనూ, ట్యాబ్ల పంపిణీ, సీబీఎస్ఈ విద్యా విధానం, ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెడుతుండడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తుండటంతో తల్లిదండ్రులు ఆకర్షితులై ఇప్పటి నుంచే అడ్మిషన్లు అడుగుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి 100 శాతం అడ్మిషన్లు పూర్తి చేస్తాం.

– టి .పుల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

గృహ సారథులు ప్రజలతో మమేకంకండి

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: గడిచిన మూడున్నర సంవత్సర కాలంలో జరిగిన సంక్షేమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలతో మమేకమై వివరించాలని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని 19 గ్రామ సచివాలయ పరిధిలో గల గృహ సారథులు, రథసారథులు, సచివాలయ కన్వీనర్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై స్థానిక నూజివీడు రోడ్డులోని పొన్నం విజయ కన్వెన్షన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు వేసి ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఏదో ఒక మంచి చేస్తామని చెప్పాల్సిందిపోయి, ఒక్కొక్కరి అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం చంద్రబాబు అరాచకానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా వైనాట్ 175 కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల అనూసా ఇసాక్, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతిమురళి, మండల సచివాలయాల కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి హరిబాబు, నాయకులు రామస్వామి, మండల మహిళా అధ్యక్షురాలు పావన జ్యోతి సుజనకుమారి పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్



గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్

రెడ్డిగూడెం: కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని మద్దులపర్వ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం అనేవి రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పెత్తందారి వ్యవస్థను పక్కన పెట్టి వలంటీర్, సచివాలయవ్యవస్థతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో నూటికి నూరు శాతం ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, రెడ్డిగూడెం మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, మద్దులపర్వ ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



గొర్రెపిల్లను ఎత్తుకొని సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. నడింపుట్రేలలో గృహాల మధ్యగా 11 కేవీ విద్యుత్ తీగలు వెళ్లడం గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తోడ్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ స్వాతి, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అంజిరెడ్డి, నాగేశ్వరరావు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ దామోధరరెడ్డి, సచివాల కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ శివబాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ కె లక్ష్మి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మామిడి మొక్కలు పంపిణీ చేసిన రాజేష్ దంపతులు

ఇబ్రహీంపట్నం: స్థానిక ఏకాలనీ సమీపంలో ఉంటున్న కొప్పుల రాజేష్, కమల దంపతులు తమ కుమారిని ప్రథమ వర్ధంతి కార్యక్రమం వినూత్నంగా నిర్వహించారు. రాజేష్ పెద్ద కుమారుడు కొప్పుల రితీష్(18) గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన ప్రథమ వర్ధంతికి బంధుమిత్రులను ఆహ్వానించారు. హాజరైన వారందరికీ కుమారుని జ్ఞాపికతో పాటు మామిడి మొక్కలు పంపిణీ చేశారు. సివిల్ ఇంజినీర్‌గా మొక్కల విలువ తనకు తెలుసని, అందుకే తన కుమారిడికి ఇష్టమైన మామిడి కాయను ఇలా మొక్కల రూపంలో బంధుమిత్రులకు అందజేసినట్లు రాజేష్ తెలిపారు.

పూత, పిందె రాలుడు సమస్యకు నివారణ చర్యలు



తోటబడి కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఓ సాహైల్ అహ్మద్, రైతులు

పొందుగల(మైలవరం): మామిడిలో పూత, పిందె రాలుడు సమస్యను సరైన యాజమాన్యం పద్ధతుల్లో నివారించవచ్చని ఉద్యాన శాఖ మైలవరం ఇన్‌చార్జి మండల అధికారి సొహైల్ అహ్మద్ తెలిపారు. మైలవరం మండలం పొందుగల, అనంతవరం గ్రామాల్లోని మామిడి తోటలను మంగళవారం పరిశీలించారు. మామిడిని ఆశించు చీడపురుగు, నీటి ఎద్దడి, వాతావరణం పరిస్థితులు, హార్మోన్ల లోపం తదితర కారణాల వలన పూత, పిందె రాలుతుందన్నారు. ఈ దశలో ఆశించు పేను, తేనె మంచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ మందును 0.5 గ్రాములు లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. మచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు ప్రోపినెబ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మా మిడి పిందెకట్టు నుంచి కాయ పెరిగే దశ వరకు కనీసం రెండు తడులు ఇవ్వాలన్నారు. తడులతో పాటుగా ప్రతి చెట్టుకు కిలో యూరియా, అర కిలో పొటాష్, వేసిన దిగుబడి బాగా పెరిగి పిందె రాలటం నివారించవచ్చని పేర్కొన్నారు. వర్షాధారంగా సాగు చేసే తోటలలో మల్టీ-కే (13:00:45) లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ యాజమాన్య పద్ధతులు పాటిస్తే పిందె రాలుతుంటే హార్మోన్ల లోపం అని గుర్తించి నాఫ్థలీన్ అసిటిక్ ఆసిడ్ 2.5 ఎంఎల్ 10లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. స్థానిక మామిడి రైతులు, ఉద్యాన శాఖ సహాయకులు, అన్నపూర్ణ దేవి, సర్పంచ్ గుగులోతు కోటమ్మ, రాంబాబు పాల్గొన్నారు.

మధురమైన మాతృభాషకు ప్రాధాన్యం



తిరువూరు ప్రతిభ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

తిరువూరు: అన్ని భాషల్లోనూ మాతృభాషకు ప్రాధాన్యం ఉందని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు అన్నారు. మంగళవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవ సందర్భంగా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి కోసం, విజ్ఞానం కోసం ఇతర భాషలను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. మాతృభాషలోని మాధుర్యాన్ని పిల్లలకు తెలియజేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు. ఎస్ఎల్ఆర్ ప్రతిభ మోడల్ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మాతృభాషా దినోత్సవంలో పలువురు అధ్యాపకులను సత్కరించారు.

జి.కొండూరు: మండలంలోని గంగినేని జెడ్పీ హైస్కూల్లో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు పి.నాగరాజు రూపొందించిన కరపత్రాన్ని పాఠశాల హెచ్ఎం రామకృష్ణ విడుదల చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కోసం పరభాషలో ఉన్నత చదువులు చదివినప్పటికీ తెలుగు భాషను విస్మరించకూడదన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు



అన్నవరంలో ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు: రైతులు నవధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. నూజివీడు మండలం అన్నవరంలో నవధాన్యాల పంటల సాగుపై పాఠశాల విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాలను సాగుతో భూమి సారవంతమవుతుందని, భూమి గుల్లబడి వానపాములు అభివృద్ధి చెందుతాయని, కర్బన శాతం, నీటి నిల్వశాతం పెరుగుతుందని రవికుమార్ పేర్కొన్నారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడటం వల్ల భూమి నిస్సారమై పంట దిగుబడులు రావడం లేదన్నారు. ఐసీఆర్పీలు నాగమల్లేశ్వరరావు, కె.రాజు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన తాటాకిల్లు

నూజివీడు: మండలంలోని బోర్వంచ పంచాయతీ కొన్నంగుంటలో మంగళవారం వేకువ జామున విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు పలగాని చెన్నారావు, తన కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మేల్కొన్న వారంతా ఇంట్లో నుంచి బయటకు పరిగెత్తుకొచ్చారు. ఇంట్లో ఉన్న రూ.60 వేలు, సామగ్రి కాలి బూడిదైంది. రూ.2లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని బాధితుడు వాపోయాడు. కట్టుబట్టలతో మిగిలిన బాధితులను సర్పంచ్ ఉదయరాజు పరామర్శించి సాయమందించారు. నూజివీడు నుంచి అగ్నిమాపక వాహనం వెళ్లే సరికే ఇల్లు కాలిపోయింది.

సంక్షిప్త వార్తలు

● రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు సూచించారు. మంగళవారం మండలంలోని చనుబండలో శ్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు తీసుకున్న వారితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల ద్వారా ఇంకా వ్యాపారాన్ని పెంచుకుని మెరుగైన జీవనోపాధి పొందాలని తెలిపారు. హౌసింగ్ టి.వేణుగోపాల్, ఏపీఎం శేఖర్, సీసీలు పాల్గొన్నారు.

● జంట హత్యల బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ముసునూరు: కాట్రేనిపాడులో జంట హత్యలకు గురైన సొంగా ఏసుమరియమ్మ, ఆమె కుమార్తె అఖిల కుటుంబాలను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల, గ్రామ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, కంబాల రాంబాబు ఆధ్వర్యంలో బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబాల సభ్యులను ఓదార్చారు.

● గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

చాట్రాయి: గృహాలను వేగవంతంగా నిర్మించుకోవాలని కేంద్ర గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ శైలజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నరసింహారావుపాలెంలో 2021- 2022 సంవత్సరంలో పీఎంవై పథకంలో మంజూరైన గృహాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర నోడల్ అధికారి కోటేశ్వరావు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జయరామాచారి, జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్, మండ పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సీతయ్య పాల్గొన్నారు.

● పేదలందరికీ ఇళ్ల పథకం అమోఘం

ముసునూరు: రాష్ట్రంలో అమలవుతోన్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం బేషుగ్గా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. మండలంలోని చింతలవల్లిలో నిర్మాణంలో ఉన్న గృహాలను అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ ఎస్ఈ జయరామాచారి, పీడీ వేణుగోపాల్, డీఈఈ సువర్ణరాజు, ఎంపీడీఓ జి.రాణి, ఏసీ డి.రాజశేఖర్, ఏపీఓ జయ ప్రసాద్ పాల్గొన్నారు.

● పురుగుమందులు అధికంగా వాడొద్దు

అక్కపాలెం(తిరువూరు): పంటలపై మోతాదుకు మించి పురుగుమందులు వినియోగించవద్దని రైతుశిక్షణ కేంద్ర జిల్లా ఉప సంచాలకులు మాధవీలత సూచించారు. మండలంలోని అక్కపాలెంలో రైతులకు సమగ్ర ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సాధ్యమైనంతవరకు పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వేయాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతులు అనుసరిస్తూ అవసరమైతేనే రసాయన ఎరువులు వేయాలని సూచించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్, రైతు శిక్షణ కేంద్ర ఏడీఏ మోనీషా, మండల వ్యవసాయాధికారి పద్మ, పాల్గొన్నారు.

● వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

జి.కొండూరు: వ్యక్తిపై దాడి జరిగిన ఘటనపై జి.కొండూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. జి.కొండూరుకు చెందిన గుంటక సుబ్బారెడ్డి అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై మంగళవారం మధ్యాహ్నం ఆత్కూరు వైపు నుంచి జి.కొండూరు వస్తున్నాడు. నంబరు ప్లేటులేని స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు జి.కొండూరు శివారులోకి రాగానే సుబ్బారెడ్డిపై దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో సుబ్బారెడ్డి తలకు గాయం కావడంతో స్థానికులు మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి చేసిన వ్యక్తులు మాస్కులు ధరించి ఉండడంతో గుర్తించలేకపోయినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధర్మరాజు పేర్కొన్నారు.

రైల్వే వ్యాగన్‌వర్క్ షాపు కార్మికుల నిరసన



రైల్వే వ్యాగన్‌వర్క్‌షాపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): నూతన పెన్షన్ విధానం రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని గుంటుపల్లి రైల్వే వ్యాగన్‌వర్క్ షాపు కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వే కార్మికులు పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక పరమైన భరోసా కల్పించేందుకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని బ్రాంచి కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.జోనల్ కమిటీ సభ్యులు ఏ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డివిజన్ కార్యదర్శి రామయ్య పాల్గొన్నారు.

60 శాతం బీసీలకు కేటాయించడం చారిత్రాత్మకం

ఇబ్రహీంపట్నం: బీసీలకు 60 శాతం ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడం చారిత్రాత్మకమైన విధానమని ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ సీట్లు కేటాయింపులో బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు 80శాతం కేటాయించడం సాహసోపేత నిర్ణయమన్నారు. గత రాజ్యసభ సీట్ల కేటాయింపులో కూడా బీసీలకు 50 శాతం కేటాయించడం సామాజిక న్యాయస్ఫూర్తిని ప్రతిబింబించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు చట్టసభలో ప్రాతినిథ్యం లేని వర్గాలకు కూడా అవకాశం లభించిందని పేర్కొన్నారు.

సేవలపై కళాజాత

కనుమూరు(గంపలగూడెం): కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో సొసైటీల ద్వారా రైతులకు అందజేస్తున్న సేవలపై మండలంలోని కనుమూరులో మంగళవారం కళాజాత ప్రచారం నిర్వహించారు. బిళ్లపాడుకు చెందిన కళాభారతి బృందం ప్రచారం నిర్వహించారు. రైతులకు అందజేస్తున్న రుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సురక్షబీమా, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు, వివిధ రంగాల వారికి అందజేస్తున్న రుణసౌకర్యాల గురించి అవగాహన కల్పిస్తూ పాటలు, వీధి, నాటకాల రూపంలో ద్వారా కళాజాత బృందం ప్రచారం నిర్వహించారు. గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు చెరుకు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

కంచర్ల గోపాలస్వామి S/o. (లేటు) వెంకటస్వామి, గోపవరం, ముసునూరు (మం), ఏలూరు జిల్లా (కృష్ణాజిల్లా) వారికి చాట్రాయి మండలం, చాట్రాయిలో ఆర్.యస్.నెం. 81/5 దాఖలా య. 1-28 సెంట్లు, ఆర్.యస్.నెం. 82/3 దాఖలా య. 0-87 సెంట్లు, ఆర్.యస్.నెం. 62/3 దాఖలా య. 1-24 సెంట్లు, ఆర్.యస్.నెం. 374/6 దాఖలా య. 0-24 సెంట్లలో య. 0-12 సెంట్లు, ఆర్.యస్.నెం. 374/10ఎ దాఖలా య. 0-13 సెంట్లలో య. 0-06 1/2 సెంట్లు భూమి కలిగి ఉన్నారు. ఈ భూమికి సంబంధించి ఒరిజినల్ దస్తావేజు నెం. 4909/2011 జిరాక్స్ కాపీలు తీయించడానికి ముసునూరు వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.

సమస్యలు పరిష్కరించండి

రెడ్డిగూడెం: భోజన పథకానికి సంబంధించిన పాఠశాలల కు రావాల్సిన గుడ్లు గ డువుకంటే ముందే వ స్తున్నాయని, సమయానికి మాత్రమే గుడ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీ యూ మండల శాఖ సభ్యు లు మంగళవారం ఎంఈఓ రఘురామ్‌కి వినతిపత్రం అందజేశా రు. జి ల్లా ప్రధానకార్యదర్శి అ ను గ్రహప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు కృష్ణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.